క్లుప్తంగా

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు

చంద్రగిరి: స్థానిక శ్రీ కోదండరామస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ఆదివారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో తెలిసో తెలియకో జరిగే దోషాల నివృత్తికి ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. మొదటిరోజు ఆదివారం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, సహస్ర నామార్చన, ఉదయం 9 నుండి 11 గంటల వరకు చతుష్టార్చన, పవిత్ర ప్రతిష్ట నిర్వహించారు. అనంతరం సీతారామ సమేత లక్ష్మణస్వామివారి ఉత్సవమూర్తులను విమాన ప్రదక్షిణగా యాగశాలకు వేంచేపు చేశారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు పవిత్ర హోమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ జ్ఞాన ప్రకాష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ముని హరిబాబు, భక్తులు పాల్గొన్నారు.

పిడియాట్రిక్స్ న్యూరాలజీపై వర్క్‌షాపు



వర్క్‌షాపులో పాల్గొన్న అతిథులు

తిరుపతి తుడా: చిన్న పిల్లల ఆరోగ్యం మెరుగుపరచడంపై రుయా న్యూర్యాలజీ విభాగం, బలరాం చైల్డ్ న్యూరో సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో పిడియాట్రిక్స్ న్యూరాలజీపై రెండు రోజుల వర్క్‌షాపు ఆదివారం ముగిసింది. చిన్నపిల్లల్లో నరాల బలహీనత, వారికి ఆరోగ్యపరంగా కలుగుతున్న ఇబ్బందులపై చర్చించి మెరుగైన వైద్యం అందించడంపై ప్రధానంగా వర్క్‌షాపులో చర్చించినట్టు చిన్నపిల్లల వైద్య నిపుణులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ జే.రాధ, వైద్యులు, కడప, నెల్లూరు, స్విమ్స్‌కు చెందిన పలువురు వైద్య నిపుణులు పాల్గొన్నారు.

ఘనంగా 'సంకల్ప' వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవం ప్రారంభిస్తున్న సంకల్ప హాస్పిటల్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: తుడా రోడ్డులోని సంకల్ప హాస్పిటల్ 9వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర బండ్ల మాట్లాడారు. హాస్పిటల్ ప్రారంభం నుంచి ఆధునిక టెక్నాలజీతో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. ప్రధానంగా కార్డియాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, జనరల్ మెడిసన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, కార్డియాక్ సర్జరీ వంటి సేవలను 24 గంటలూ అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ ప్రతినిధులు డాక్టర్ నాగరాజ్‌కుమార్, డాక్టర్ అనంతనాగ్, సోమేశ్వర్ బండ్ల, హాస్పిటల్ సిబ్బంది, మెడికల్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గంగ కాలువకు మరమ్మతులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట చెరువు నుంచి గంగ నీటి అందించే స్లూయిజ్ కాలువకు మరమ్మతులు చేస్తున్నట్టు డీఈ శ్రీధర్ తెలిపారు. రూ.6లక్షలతో రెండు కిలోమీటర్ల మేర ఉన్న స్లూయిజ్ కాలువకు మరమ్మతులు చేపడుతున్నామన్నారు. కాలువపై ఉన్న ముళ్ల పొదలను తొలగించి శుభ్రం చేసి, కాలువకు ఓ వైపున ఉన్న రోడ్డుకు గ్రావెల్ మట్టిని తోలి మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు.

నగరంలో నేటి కార్యక్రమాలు

- **కోటి సంతకాల సేకరణ సమావేశం**

తిరుపతి రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించడానిక కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రంలో కోటి సంతకాల సేకరణకు వైఎస్సార్ సీపీ పూనుకోవడం విదితమే. ఇదే అంశంపై చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సోమవారం ఉదయం 10 గంటలకు చంద్రగిరి బైపాస్ రోడ్డులోని వైఎస్ ఎంఆర్ కల్యాణ మండపంలో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు.

- నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, 10.30 నుంచి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్.

ఎక్సైజ్‌కు నో ఎక్సర్‌సైజ్..!

- చంద్రగిరిలో 24 గంటలూ అందుబాటులో బెల్టు దుకాణాలు
- 'బెల్టు'తో బతుకులు రోడ్డుపాలు!
- మద్యం సేవించి రోడ్లపై పడిపోతున్న మందుబాబులు



తొండవాడ-చంద్రగిరి మార్గంలో ఆదివారం ఉదయమే మద్యం సేవించి పడిపోయిన మందుబాబు

చంద్రగిరి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు పుట్టుకొచ్చాయి. గత ప్రభుత్వంలో కనిపించని బెల్టు దుకాణాలకు ఇప్పుడు రెక్కలొచ్చాయి. 24 గంటలూ వీటిల్లో మద్యం లభించడంతో పేదల బతుకులు కుదేలవుతున్నాయి. రోజువారీ కూలీలు, వృద్ధులు ఈ దుకాణాల్లో పూటుగా మద్యం సేవించి, మద్యం మత్తులో నడిరోడ్డుపై పడకేస్తున్నారు. కొంత మంది మృత్యువాత పడిన ఉదంతాలూ లేకపోలేదు.. ఆదివారం ఉదయం చంద్రగిరి-తొండవాడ రహదారి మార్గంలోని హీలా కళాశాల సమీపంలో ఓ వృద్ధుడు ఉదయం 9 గంటలకే పీకల్దాకా మద్యం సేవించి రోడ్డు పక్కన పడిపోయాడు. మధ్యాహ్నం 12 గంటల వరకు కూడా స్పృహలోకి రాకపోవడంతో అటు వైపు వెళ్తున్న వాహన ప్రయాణికులు అతడి వద్ద వాటర్ బాటిల్ ఉంచి వెళ్లారు. చంద్రగిరి, పనపాకం, ఐతేపల్లె, కొటాల, ఏ.రంగంపేట, కందులవారిపల్లె ప్రాంతాల్లో విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు ఉన్నాయని ఆ ప్రాంత ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. చంద్రగిరిలోని కావమ్మగుడి సమీపంలోని ఓ ఇంట్లో మద్యం దుకాణం తలపించేలా విక్రయాలు చేస్తున్నారని, పనపాకం పంచాయతీలోని ఓ వ్యక్తి 24 గంటలూ మద్యాన్ని విక్రయిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఇటీవల ఎక్సైజ్ అధికారులు దాడులు సైతం చేసి మద్యం స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినా అతను మాత్రం బెల్టును మరింత విస్తరించి అమ్మకాలు జోరుగా చేస్తున్నట్టు గ్రామస్తులు వాపోతున్నారు. ఎక్సైజ్ అధికారులు పూర్తిస్థాయిలో మండల వ్యాప్తంగా బెల్టు దుకాణాలపై చర్యలు చేసుకోవాలని కోరుతున్నారు.

బస్టాండ్‌లో పార్కింగ్ చేసి ఉన్న లాంగ్ స్టాండింగ్ బస్సులు



ఈ బస్సుల వల్లే బస్టాండ్‌లో ట్రాఫిక్..!

-12 నుంచి 18 గంటలు బస్టాండ్‌లోనే..!



బస్టాండ్‌లో ట్రాఫిక్ సమస్యతో ఆగిపోయిన బస్సులు(ఫైల్)

తిరుపతి అర్బన్: దూర ప్రాంతాలకు వెళ్లే కొన్ని బస్సులు తిరుపతి బస్టాండ్‌లో 12 నుంచి 18 గంటల పాటు పార్కింగ్ చేస్తుండడంతో ఇక్కడ ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దూర ప్రాంతాలకు చెందిన కొన్ని సర్వీసులు మధ్యాహ్నం తర్వాత తిరుపతి బస్టాండ్‌కు వస్తున్నాయి. తిరిగి ఆ బస్సులు మరుసటి రోజు ఉదయం తర్వాత బయలుదేరుతున్నాయి. మరి కొన్ని బస్సులు తెల్లవారుజామున తిరుపతి బస్టాండ్‌కు చేరుకుని రాత్రి ఇక్కడ నుంచి బయలుదేరుతున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. గంటల కొద్దీ బస్టాండ్‌లో పార్కింగ్ చేయకుండా మరోచోట వాటిని పార్కింగ్ చేసేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. మరోవైపు బస్టాండ్‌లో 11 మంది ఆర్టీసీ కంట్రోలర్లు పనిచేస్తున్నా వీరిలో చాలమంది డ్యూటీలో ఉన్నప్పటికీ బస్టాండ్‌లో అందుబాటులో ఉండడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. దీనివల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తినప్పుడు వెంటనే వాటిని క్లియర్ చేయకపోవడం మరిన్ని సమస్యలకు కారణమవుతోందని ప్రయాణికులు మండిపడుతున్నారు. సాధారణంగా ప్రయాణ సమయంలో ట్రాఫిక్ సమస్యలను చూస్తుంటాం. అయితే దీనికి భిన్నంగా తిరుపతి బస్టాండ్‌లోనే ట్రాఫిక్ సమస్యలు తలెత్తుండటం గమనార్హం! బస్టాండ్‌లో 72 ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. రోజుకు 2,500లకు పైగా బస్సులు వచ్చిపోతుంటాయి. అయితే వంద బస్సులకు పైగా లాంగ్ స్టాండింగ్ పేరిట ఇక్కడే పార్కింగ్ చేయడం ట్రాఫిక్ సమస్యకు దారితీస్తోంది.

రాస్‌లో ప్లే అండ్ లెర్న్ ఈవెంట్



పిల్లలతో ప్రేరణ ప్రతినిధులు

రేణిగుంట: కరకంబాడి పంచాయతీలో ఉన్న రాస్ బ్రాంచ్‌లో ప్రేరణ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం బుద్ధిమాంద్యం పిల్లలతో ప్లే అండ్ లెర్న్ ఈవెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలకు అవసరమైన ప్లే అండ్ లెర్న్ మెటీరియల్‌ను అందజేశారు.. సొసైటీ ప్రతినిధులు పిల్లలు కలిసి ఆనందంగా ఆటలు ఆడారు. ప్రేరణ హెల్పింగ్ సొసైటీ కోశాధికారి తరుణ్ మాట్లాడుతూ, సొసైటీకి రాస్‌లోని పిల్లలతో 13 ఏళ్లుగా బంధాన్ని కొనసాగిస్తున్నామని అన్నారు. పిల్లలకు ప్లే అండ్ లెర్న్ మెటీరియల్ ఇవ్వడం సంతోషంగా ఉందని తెలిపారు.

ప్రజల చేతిలో పాశుపతాస్త్రం 'సమాచార హక్కు చట్టం'



ప్రజల చేతిలో పాశుపతాస్త్రం-సమాచార హక్కు చట్టం కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: సామాన్యుల చేతిలో పాశుపతాస్త్రం వంటిది 'సమాచార హక్కు చట్టమని, దీనిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని తమ హక్కులను కాపాడుకోవాలని' జిల్లా విని యోగదారుల సమాచార సంఘం అధ్యక్షుడు పి.రాజారెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ సమాచార హక్కుల చట్టం దినోత్సవం 20వ వార్షికోత్సవం సందర్భంగా కరపత్రాలను, పోస్టర్లను ఆయన ఆదివారం సంఘ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయనతోపాటు ఆంధ్రప్రదేశ్ సమాచార హక్కు చట్టం ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాసులు మాట్లాడారు. ఈ చట్టం గ్రామ కార్యదర్శి నుంచి రాష్ట్రపతి వరకు జవాబుదారులేనన్నారు. ఈ చట్టం దుర్వినియోగం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా సమాచార హక్కు ఐక్య వేదిక ప్రతినిధులు వి.మునిచంద్రారెడ్డి, పి.చంద్రశేఖర దేవేంద్ర, వి.సుధాకర్‌రెడ్డి, ప్రకాష్ పాల్గొన్నారు.

నేటి నుంచి సీఐటీయూ జిల్లా మహాసభలు

తిరుపతి కల్చరల్: పుత్తూరు పట్టణంలో సోమ, మంగళవారం సీఐటీయూ జిల్లా 8వ మహాసభలు నిర్వహిస్తున్నట్టు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభలకు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నర్సింగ్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అజయ్‌కమార్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని, తొలిరోజు పుత్తూరు రైల్వేస్టేషన్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ మీదుగా వీఎస్ఎన్ కల్యాణ మండపం వరకు భారీ ర్యాలీ అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు. కార్మికులు అందరూ పాల్గొని ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

రజక సంఘాలతో చైర్‌పర్సన్ భేటీ

తిరుపతి కల్చరల్: రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆదివారం ఓ హోటల్లో రజక సంఘాల ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ఇప్పటి వరకు రజకుల ఆకాంక్ష సభలు రాజమండ్రి, విశాఖపట్నం ప్రాంతాల్లో నిర్వహించి రజక సమస్యలపై చర్చి కొన్ని నిర్ణయాలు తీసుకున్నామని, త్వరలో మూడో సభ ఎన్‌టీఆర్ జిల్లా తిరువూరులో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.రజకులను ఎస్సీ జాబితాల్లో చేర్చాలనే డిమాండ్‌ను ఇప్పటి వరకు జరిగిన సభల్లో మంత్రులు, ఎమ్మెల్యే మద్దతు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్ సతీష్ (అమలాపురం జిల్లా), సుకుమాంబ, చిత్తూరు ఉమ్మడి జిల్లా డైరెక్టర్లు అన్నాసముద్రం మదనమోహన్, కరాటే చంద్ర, ఏపీరాష్ట్ర రజక జనసేన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కినపల్లి లక్ష్మయ్య, మల్లెల నాగరాజు, గంధం బాబు, చెంబుకూరి రాజయ్య, చాకలి శంకర్, బాలాజీ వెంకటేష్, మణి, సుధాకర్, శివ, ఈశ్వర్, దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి మెడికల్ కిట్లు వితరణ



మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి సంస్థ ఆదివారం అలిపిరి రోడ్డులోని శ్రీపద్మావతి వృద్ధాశ్రమానికి ఉచితంగా మెడికల్ కిట్లు వితరణ చేసింది. బీపీ మానిటర్, డయాబెటీస్ మానిటర్, హాట్ వాటర్ కెటిల్ థర్మామీటర్, ఎపోరస్ ట్రిమ్మర్..మొదలైన వాటిని సంస్థ అధ్యక్షుడు బండి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు. లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ ఎం.భాస్కర్, లయన్స్ క్లబ్ కార్యదర్శి చెన్నుపాటి చక్రపాణి, కోశాధికారి వి.పురుషోత్తం నాయుడు, ఉపాధ్యక్షుడు జి.శంకర్, సభ్యులు రామచంద్రారెడ్డి, బాబురావు, వృద్ధాశ్రమ నిర్వాహకుడు డాక్టర్ బి.మునీంద్ర నాయక్, వృద్ధు పాల్గొన్నారు.

బద్రీనాథ్‌ను దర్శించుకున్న భూమన దంపతులు



ఆలయం బయట భూమన దంపతులు

తిరుపతి మంగళం: ఉత్తరాఖండ్ రాష్ట్రం చమోలి జిల్లాలోని గర్వాల్ హిల్ వద్ద బద్రీనాథ్‌ను ఆదివారం టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి దంపతులు దర్శించుకున్నారు. గొప్ప విశేషం కలిగిన విష్ణు మూర్తి ఆలయాన్ని సందర్శించి బద్రీనాథుడిని దర్శించుకోవడం తమ పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్టు భూమన తెలిపారు.

ఆకట్టుకున్న భారతీయ సాంప్రదాయ నృత్య కళాభినయం



జర్నలిస్టు శివమూర్తిని జీవిత సాఫల్య అవార్డుతో సత్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: వే ఫౌండేషన్ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం మహతి కళాక్షేత్రంలో వివిధ ప్రాంతాల కళాకారులు ప్రదర్శించిన భారతీయ సంస్కృతి, సాంప్రదాయ నృత్యాల ప్రదర్శన ఆకట్టుకుంది. శ్రీశక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని, ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ శ్రీహరిరావు, రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్‌నాథ్ ముఖ్య అతిథులుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. భారతీయ సంస్కృతి, సాంప్రదాయ కళా నృత్య ప్రదర్శనలతో కళాకారులను, నృత్య కళలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. నిస్వార్థంగా సమాజ సేవలు అందిస్తున్న వారిని ప్రతి ఏటా అవార్డులతో సత్కరించడం సంతోషకరమన్నారు. అనంతరం హిందూ విలేకరుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు మునిరామరెడ్డితో పాటు జర్నలిస్టు శివమూర్తికి జీవిత సాఫల్య పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో వే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పైడి అంకయ్య, వివిధ రంగాల ప్రముఖులు, కళాకారులు, విద్యార్థులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

● నృత్యార్చన



చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో వారాంతపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం బెంగళూరుకు చెందిన శ్రీనాట్యధార కళాకారుల శాస్త్రీయ నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నాట్య గురువు కృతిక ఎస్.కుమార్ నేతృత్వంలో కళాకారులు కృతిక ఎస్.కుమార్, పూజిత ఎస్.భట్, నవ్య సుధీంద్ర, నవీన్, గౌతమ్, మానస తదితరులు పుష్పాంజలి, ఇంద్ర, నరసింహ కౌత్వం, గజవదన, మహాదేవ శివ శంభో, మాతే మలయాద్, హనుమంత దేవ్, శంకర శ్రీగిరి, శ్రీమాన్ నారాయణ, వలచిన తిల్లనా, మంగళం తదితర గీతాలకు తమ నృత్యంతో సమ్మోహితుల్ని చేశారు. అనంతరం ఏఓ సుధాకర్ కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

నిబంధనలతో టీటీడీ ఉద్యోగులు క్రాకర్స్ విక్రయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్

తిరుపతి కల్చరల్: ప్రభుత్వ నిబంధనలను అనుసరిస్తూ టీటీడీ ఉద్యోగులు క్రాకర్స్ విక్రయాలు కొనసాగించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే అడ్డుకుంటామని బాలాజీ క్రాకర్స్ అసోసియేషన్ నేతలు హెచ్చరించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడారు. తాము నిబంధనల మేరకు లైసెన్స్‌లు పొంది అసోసియేషన్ ద్వారా 2006 నుంచి తిరుపతిలో దీపావళికి క్రాకర్స్ 18 శాతం రాయితీపై విక్రయిస్తున్నామని, అధికారులు తిరుపతిలో నిర్దేశించిన మూడు ప్రాంతాల్లో మాత్రమే విక్రయిస్తున్నట్టు చెప్పారు. అయితే కొందరు టీటీడీ ఉద్యోగులు టీటీడీ కో- ఆపరేటివ్ సొసైటీ పేరుతో లైసెన్స్ పొంది 30 ఏళ్లుగా నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రత్యేక ప్రాంతాల్లో క్రాకర్స్ విక్రయిస్తూ అధిక ఆదాయం పొందుతున్నారని, పైగా ఉద్యోగులకు రాయితీపై ఇవ్వడం లేదన్నారు. నిర్ణయించిన ప్రాంతంలోనే క్రాకర్స్ వ్యాపారం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించకుండా కట్టడి చేయాలని కోరారు. సమావేశంలో బాలాజీ క్రాకర్స్ అసోసియేషన్ నేతలు చక్రవర్తి, శ్రీనివాస్, మురళీకృష్ణ, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

నలంద నగర్ సమస్యలు పరిష్కరించరూ!

-తుడా చైర్మన్‌కు వినతి



కమ్యూనిటీ హాల్ భవన శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న తుడా చైర్మన్, స్విమ్స్ డైరెక్టర్, అతిథులు

తిరుపతి తుడా: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఉపాధ్యాయుల కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్, తిరుపతిలోని నలందనగర్ నివాసితుల సమస్యలు పరిష్కరించాలని తుడా చైర్మన్ డాక్టర్ సి.దివాకర్ రెడ్డిని ఆ ప్రాంత ప్రజలు కోరారు. నలంద నగర్‌లోని మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తుడా చైర్మన్‌ను సన్మానించారు. అధ్యక్షత వహించిన నలంద నగర్‌లోని ఎస్వీయూ టీసీహెచ్ఎస్ లిమిటెడ్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఏ.సాంబశివారెడ్డి, కార్యదర్శి ప్రొఫెసర్ పి.రాజశేఖర రెడ్డి, పలువురు ప్రముఖులు, నివాసితులు సమస్యలను, ప్రధానంగా డ్రైనేజీ సమస్యను తుడా చైర్మన్‌తో చర్చించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. పారిశుధ్యం మెరుగు పరచడానికి కి నలంద నగర్‌లోని ధ్యానమందిరం, శివాలయం మధ్య ప్రాంతాన్ని కప్పి ఉంచడానికి మురుగు కాలువ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. స్విమ్స్ డైరెక్టర్ ఆచార్య ఆర్వీ కుమార్ మాట్లాడుతూ, తిరుపతిలోని స్విమ్స్ కోసం కొత్త ఆడిటోరియం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కమ్యూనిటీ హాల్ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్వీయూ హెల్త్ సెంటర్ సీనియర్ మెడికలాఫీసర్ (రిటైర్డ్) డాక్టర్ వై.రాఘవ రెడ్డి, ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. భూపతి నాయుడు, భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. సత్యనారాయణరాజు, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ (రిటైర్డ్) పి.మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

14న బుద్ధుడి విగ్రహావిష్కరణ

డక్కిలి: మండలంలోని అంబేడ్కర్ నగర్‌లో ఈ నెల14వ తేదిన ఉదయం 11 గంటలకు అంబేడ్కర్ ధర్మ పోరాట సమితి (ఏడీపీఎస్) ఆధ్వర్యంలో గౌతమ బుద్ధుడి విగ్రహావిష్కరణ నిర్వహించనున్నట్లు ఏడీపీఎస్ నాయకులు గుండోలు గోపాల్, జంగిటి వెంకటయ్య ఆదివారం తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నాగాలమ్మ ఊరేగింపు



రాఘవేంద్రనగర్‌లో నాగాలమ్మను ఊరేగిస్తున్న ఆలయ నిర్వాహకులు, భక్తులు



ఊరేగింపులో డప్పు వాయిద్యాల నడుమ నృత్యం చేస్తున్న భక్తులు

తిరుపతి మంగళం: తిరుపతి రాజీవ్‌గాంధీకాలనీ రాఘవేంద్రనగర్‌లోని నాగాలమ్మను ఆదివారం వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలు, డప్పు వాయిద్యాల హోరు నడుమ ఊరేగించారు. ఆలయ నిర్వాహకులు సత్యవతి, సుబ్రమణ్యం, ఏకాంబరం, సుధారాయల్, గోపాల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయాన్ని నూతనంగా నిర్మించి, అమ్మవారిని ప్రతిష్టించిన నేపథ్యంలో మూడు రోజులుగా మహా కుంభాభిషేకం, మహాగణపతి హోమం, ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా చేశారు. మధ్యాహ్నం వెయ్యిమందికి పైగా భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం నాగాలమ్మను స్థానిక కాలనీలలో ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.